

డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,250, మధ్య డెల్టాకు 1,615, పశ్చిమ డెల్టాకు 4,240 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



ప్రైవేట్ స్కూళ్లలో సొంత పాఠాలు

ప్రభుత్వ ఆదేశాలను ప్రైవేటు పాఠశాలలు పట్టించుకోవడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా తమ పాఠశాలల్లో సొంత సిలబస్‌ను బోధిస్తున్నాయి.

- 8లో

గరిష్టం/కనిష్టం

31.6° / 24.3°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	31.5	24.6
కాకినాడ	31.6	24.3
అమలాపురం	32.0	25.0

న్యూస్‌రీల్

8న మెగా వైద్య శిబిరం

రాజానగరం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాజానగరంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందన్నారు. జీఎస్ఎల్, సుభద్ర ఆస్పత్రుల సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గుండె వైద్యం, స్త్రీల వైద్యం, చిన్న పిల్లల వైద్యం, చర్మ వ్యాధులు, మూత్రకోశ వ్యాధులు, నరాల బలహీనత, కిడ్నీ వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, ఛాతీ, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులకు, కీళ్లు, ఎముకలు, కంటి, దంత వైద్యానికి సుమారు 40 మంది ప్రముఖ వైద్యుల పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

నన్నయలో ముగిసిన ఐఎఫ్‌పీ శిక్షణ



ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ అబ్రహం

రాజానగరం: విద్యా బోధనలో మార్పులను ఆకళింపు చేసుకునేందుకు శిక్షణ కార్యక్రమాలు ఉపయోగడతాయని జిల్లా విద్యా శాఖాధికారి అబ్రహం అన్నారు. ఉండ్రాజవరం, చాగల్లు, కడియం మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులకు ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్) పై బ్యాచ్‌కి రెండు రోజులు చొప్పున ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఆరు రోజులపాటు జరిగిన శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డీఈఓ అబ్రహం మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విధిగా ఐఎఫ్‌పి, స్మార్ట్ టీవీలను ఉపయోగించి విద్యార్థులకు పాఠాలను బోధించాలన్నారు. రాబోయే రోజులలో బోధనలో కంప్యూటర్ ప్రధాన పాత్ర వహిస్తుందన్నారు. అందుకు తగిన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కోర్సు డైరెక్టర్, కడియం ఎంఈఓ వి. లజపతిరాయ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఫలితాలను సాధించాలనే ఉద్దేశంతో ఇస్తున్న ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి ఫలితాలను రాబట్టాలన్నారు. తరగతి గదులలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బోధన చేయడం, ఐఎఫ్‌పీ, బైజూస్‌లపై అవగాహన కలిగించడంలో భాగంగా ఈ శిక్షణా తరగతులు నిర్వహించారన్నారు. శిక్షణకు రీసోర్స్‌పర్సన్స్‌గా డాక్టర్ డి. శ్రీనివాసరావు, ఎం. రామకృష్ణ, ఎ. విజయదుర్గ, డి. కిషోర్‌లు వ్యవహరించారు.

రెండో విడతగా 5.8 టన్నుల టమాటాలు

కొవ్వూరు: జిల్లాలో రాజమహేంద్రవరం.. కొవ్వూరు రైతు బజార్లకు గురువారం రెండో విడతగా టమాటాలు దిగుమతి అయ్యాయి. జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి ఎం.సునీల్ వినయ్ ఈ విషయం తెలిపారు.రాజమహేంద్రవరం ఐదు టన్నులు ,కొవ్వూరు ఎనిమిది క్వింటాళ్లు చొప్పున సరకు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. టమాటా ధరలు మార్కెట్‌లో పెరిగిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సబ్సీడీపై కిలో రూ.50కే అందిస్తోందన్నారు. ప్రజలు ఈ సబ్సీడీ టమాటాను కొనుగోలు చేయాలని సూచించారు. ఆధార్ కార్డు ఆధారంగా చేసుకుని కుటుంబానికి కిలో చొప్పున అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

శరవేగంగా రత్నగిరి అభివృద్ధి పనులు

అన్నవరం రత్నగిరి సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. ఇటీవల వర్షం కొంత అడ్డంకిగా మారినా నవంబరు నాటికి పూర్తవ్వాలనే ఉద్దేశంతో వేగం పెంచారు. పార్కింగ్ స్థలంతోపాటు వాహనాల ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా సీఆర్వో ఆఫీసు వెనుక నుంచి రెండో ఘాట్‌రోడ్ వరకు కొత్తగా రోడ్డు నిర్మిస్తున్నారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ ఎప్పటి కప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు. పార్కింగ్ కోసం సత్యగిరి రోడ్డు పక్కనున్న కొండను చదును చేస్తున్నారు. మల్టీలెవిల్ పార్కింగ్ పద్ధతిలో 650 కార్లు మూడు అంచెలుగా నిలిపేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. నెల రోజుల్లో పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

నేరుగా రెండో ఘాట్‌రోడ్‌కు రోడ్డు: ప్రస్తుతం రత్నగిరికి స్వామివారి దర్శనం అనంతరం రెండో ఘాట్ రోడ్ ద్వారా వాహనాలలో భక్తులు దిగువకు వస్తున్నారు. సాధారణ రోజుల్లో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకపోయినా శని, ఆదివారాలలో, లేదా పర్వదినాల్లో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది.

అక్రమార్కులపై కొరడా

- ప్రజాధనం పక్కదారి పట్టకుండా చర్యలు
- వడివడిగా అధికారుల విచారణ
- బాధ్యుల సస్పెన్షన్లు.. క్రిమినల్ కేసులు
- అన్ని స్థాయిల్లోనూ ఉక్కుపాదం



సాక్షిప్రతినిధి–కాకినాడ: అవినీతి, అక్రమాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తర, తమ భేదం లేకుండా ఉక్కుపాదం మోపుతోంది, అవినీతికి పాల్పడ్డవారు ఎంతటి వారైనా విడిచిపెట్టడం లేదు. ఈ మేరకు శాఖాపరంగానే కాకుండా క్రిమినల్ కేసులు కూడా పెట్టాల్సిందేనని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అందుకు అనుగుణంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ శాఖల్లోని అక్రమార్కులపై కలెక్టర్లు కొరడా ఝుళిపిస్తున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ తదితర శాఖల్లో డివిజన్ స్థాయి అధికారులు అక్రమాలకు పాల్పడినా క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెన్షన్, బదిలీ వేటు వేస్తున్నారు.

అన్ని శాఖల్లోనూ చర్యలు

విధుల్లో అలసత్వం, ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై ఉదాసీనత, అవినీతి ఆరోపణలు వంటి కారణాలతో కాకినాడ ఆర్డీఓ బి.వెంకటరమణను ప్రభుత్వం తాజాగా బదిలీ చేసింది. కాకినాడ సర్పవరం సబ్ రిజిస్ట్రార్ వీవీఎల్ నరసింహారావును టీడీఆర్ బాండ్‌లలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ నాగలక్ష్మి సస్పెండ్ చేశారు.

నాడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాగా ఉండగా అమలాపురం రూరల్ కామనగరువులో లేని భూమిని ఉన్నట్టుగా రికార్డులు సృష్టించి బ్యాంక్ నుంచి రుణాలు పొందిన కుంభకోణంలో అప్పటి తహసిల్దార్ జ్ఞానాంబ సహా పలువురిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అయినవిల్లి మండలంలో ఒకరికి వచ్చిన భూ పరిహారాన్ని మరొకరి పేరుతో దారిమళ్లించిన వ్యవహారంలో ఆర్డీఓ కార్యాలయ అధికారిపై వేటు వేశారు.

క్రిమినల్ కేసు నమోదు

ఇటీవల డ్వాక్రా సంఘాల రుణాల్లో అవకతవకలకు పాల్పడిన మహిళా సంఘాల సహాయకురాలిని అరెస్టు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో క్రిమినల్ కేసు నమోదు చేసి ఊచలు లెక్కపెట్టించారు. అమలాపురం రూరల్ పేరూరులో చింతపల్లివారిపాలెంలో స్త్రీ నిధి, ఉన్నతి, పొదుపు సొమ్ములో దుర్వినియోగానికి పాల్పడ్డ నెల్లి కనకదుర్గపై బుధవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకర్ ప్రసాద్ ఫిర్యాదుతో కనకదుర్గపై క్రిమినల్ కేసు నమోదైంది. ఈమెను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించిన సంగతి తెలిసిందే.

వేట్లపాలెంలో అవినీతి వేట

కాకినాడ జిల్లా వేట్లపాలెం గ్రామ పంచాయతీ నిధులను నిలువునా దోచేసిన వారిపై క్రిమినల్ చర్యలకు కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశాలు జారీచేశారు.

ఈ అతి పెద్ద మేజర్ గ్రామ పంచాయతీలో నిధులు కూడా పుష్కలంగా ఉంటాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌గా ఎన్నికైన వల్లూరి శేషవేణి, భర్త, ఉపసర్పంచ్ వల్లూరి శ్రీనివాస్, అప్పటి పంచాయతీ అధికారులు కుమ్మక్కై ప్రజాధనాన్ని పెద్ద ఎత్తున స్వాహా చేశారు. ఈ అవినీతి భాగోతాన్ని 'దేశం అవినీతి పంచాయతీ' శీర్షికన 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. 2013 నుంచి రికార్డులు పూర్తి స్థాయిలో పరిశీలించిన కాకినాడ రూరల్ డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి ఇప్పటికే మధ్యంతర నివేదిక సమర్పించారు.

అక్రమాలకు పాల్పడిన సొమ్ము రూ.4 కోట్లు పైమాటగానే ఉందని నిర్ధారణకు వచ్చారు.



సర్పంచ్ వల్లూరి శేషవేణి



ప్రస్తుత సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి



నెల్లి కనకదుర్గ, డ్వాక్రా గ్రామ సహాయకురాలు



జీవీఎల్ నరసింహారావు, సర్పవరం సబ్ రిజిస్ట్రార్

భార్య శేషవేణి అధికారాన్ని అడ్డంపెట్టుకుని భర్త సాగించిన అక్రమాల దందా మరో నాలుగైదు కోట్లు వరకు ఉందని గుర్తించి విచారణ కొనసాగిస్తున్నారు. ప్రాథమికంగా సర్పంచ్ శేషవేణి, ప్రస్తుత సర్పంచ్ సీహెచ్ వెంకటలక్ష్మి సహా ఎనిమిది మందిపై క్రిమినల్ కేసులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

వేట్లపాలెం పంచాయతీలో స్వాహా ఇలా..

వల్లూరి శేషవేణి	మాజీ సర్పంచ్	రూ.2,70,34,491	క్రిమినల్ కేసు
సీహెచ్ వెంకటలక్ష్మి	సర్పంచ్	రూ.66,05,956	క్రిమినల్ కేసు
పీఎస్ఆర్ రాజేశ్వరరావు	రిటైర్డ్ సెక్రటరీ	రూ.6,26,280	ప్రభుత్వానికి నివేదిక
జీవీ రమణ	సెక్రటరీ సస్పెండ్	రూ.1,02,87,766	కమిషనర్ పీఆర్ నివేదిక
కె.లక్ష్మీసూర్యకళ	జూ.అ.	రూ.9,76,693	సస్పెండ్ చేశారు
మోకా సత్యనారాయణ	బిల్లు కలెక్టర్	రూ.9,76,693	సస్పెండ్ చేశారు
అవసరాల భగవానులు	స్వీపర్(ఎన్ఎంఆర్)	రూ.9,76,693	మృతి
మన్యాల సత్యనారాయణ	ఆపరేటర్	రూ.9,76,693	క్రిమినల్ కేసు

జేకేసీ అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జగనన్నకు చెబుదాం (జేకేసీ) పెండింగ్ అర్జీలపై సహేతుకమైన వివరణ ఇస్తూ, వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించినట్లు కలెక్టర్ మాధవీలత తెలిపారు. రెవెన్యూ, రీసర్వే, భూసేకరణ, పర్యాటక రంగం, భూ అంశాలు, స్పందన, రెవెన్యూ అర్జీలు, జేకేసీ, వ్యవసాయ అనుబంధ రంగాలు, పంచాయతీ రాజ్, ఉపాధి వేతనాలు తదితర అంశాలపై గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి, ఇతర అధికారులు వెలగపూడి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జేకేసీకి 3,292 అర్జీలు రాగా 2,470 పరిష్కరించామని, రీఓపెన్ అయిన 233 వాటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జిల్లాలో టూరిజం భూసేకరణ కోసం ఆరు ప్రాజెక్టులు ప్రతిపాదించగా మూడింటిని సీసీఎల్ఏకు పంపామన్నారు. ఒక ప్రాజెక్టుకు సంబంధించిన భూములను ముందస్తు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 15,803 మంది రైతులకు ఈకేవైసీ చేపట్టాల్సి ఉందన్నారు. కిసాన్ డ్రోన్ పైలెట్ శిక్షణ కోసం జిల్లాకు 20 యూనిట్లు లక్ష్యంగా ఇవ్వగా ఇప్పటి వరకూ 14 యూనిట్లకు రైతుల నుంచి ప్రతిపాదనలు పంపామన్నారు. జగనన్న సురక్షకు సంబంధించి జిల్లాలో 103 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో గ్రామ సభలు నిర్వహించామన్నారు. డీఆర్వో జి.నరసింహులు, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, టూరిజం ఈడీ వి.స్వామినాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబువి మాయమాటలే..



నిడదవోలులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

- అర్హుల కోసమే జగనన్న సురక్ష
- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

నిడదవోలు: ఎన్నికలు వస్తుండడంతో జనాన్ని మళ్లీ మోసగించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని, వంద శాతం పథకాల లబ్ధిని అర్హులకు అందించడానికే సీఎం జగన్ 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. నిడదవోలు రామ్‌నగర్ సచివాలయంలో 2, 3 వార్డుల ప్రజలకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల ద్వారా టీడీపీ నాయకులకే సంక్షేమ పథకాలు అందేవన్నారు. నేడు అర్హత ఉంటే చాలు వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి పథకాలను అందిస్తున్నారని వివరించారు. టీడీపీ, వైఎస్సార్ సీపీ పాలనల మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారని.. వచ్చే ఎన్నికల్లో మళ్లీ టీడీపీకి పరాభవం తప్పదన్నారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టడంతో టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మూడున్నరేళ్లు ఇంటికే పరిమితమై ఇప్పుడు మళ్లీ తెరపైకి వస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే జీఎస్ రావు కుమారుడిగా ప్రజా సేవ చేసేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని శ్రీనివాసనాయుడు చెప్పారు. అనంతరం 645 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, జేసీఎస్ కన్వీనర్ ఎస్‌కే చాన్‌బాషా, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, ఎండీ షకీరాబేగం, కొత్తపల్లి సుప్రియ, ఆలమూరి భారతి తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్‌టీ, స్కానింగ్ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.కె.వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో నమోదుకాని అసిస్టెడ్ రెప్రొడెక్టివ్ టెక్నిక్స్ కేంద్రాలు (ఏఆర్‌టీ సెంటర్లు), స్కానింగ్ కేంద్రాలను నిర్వహించడం చట్టవిరుద్ధంగా పరిగణించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె వెంకటేశ్వరరావు తెలిపారు. వాటిపై పీసీపీఎన్‌డీటీ, సరోగసి యాక్ట్‌ల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బొమ్మూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంతాన సాఫల్య కేంద్రాలు కచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. నియమాలు పాటించకుండా అనుమతులు లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఆర్‌టీసెంటర్లు, సంతాన సాఫల్య కేంద్రాల నిర్వహణకు అనుమతుల కోసం వైద్యులు, సిబ్బంది, ల్యాబ్ పరికరాలు వాటి వివరాలను నేషనల్ ఏఆర్‌టీ పోర్టల్‌లో సమర్పించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిర్దేశించిన రుసుము చెల్లించి అప్లికేషన్ వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి అందజేయాలన్నారు. జిల్లా ఏఆర్‌టీ తనిఖీ బృందం వీటిని పరిశీలిస్తుందన్నారు. గైనకాలజిస్ట్, పేథాలజిస్ట్, రేడియాలజిస్ట్ , సోషల్ వర్కర్, మోనటరింగ్ కన్సల్టెంట్, ఎన్జీవోల బృందం ఈ కేంద్రాలను తనిఖీ చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న అథారిటీ కమిటీ అనుమతి పొందిన తరువాత రాష్ట్ర కార్యాలయానికి పంపించాలన్నారు. రిజిస్టర్ నెంబర్‌తో కూడిన సర్టిఫికెట్‌ను ఆయా కేంద్రాలలో కనిపించేలా ప్రదర్శించాలన్నారు. రిజిస్టర్ సర్టిఫికేట్ లేని సంతాన సాఫల్య కేంద్రాలను నమ్మవద్దన్నారు. ఇటువంటి ఆసుపత్రులు ఉంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని డా.కె.వెంకటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో ఎస్ సత్య కుమార్, సత్యవతి , ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయంలోని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లో ఒక స్థానాన్ని భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను సమర్పించేందుకు జూలై 19 వరకూ గడువు ఉందన్నారు. జిల్లా న్యాయస్థాన అధికారిక వెబ్ సైట్, తూర్పు గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ నోటీస్ బోర్డులో దరఖాస్తులు అందుబాటులో ఉంచామన్నారు. క్రిమినల్ లాలో అనుభవంతో పాటు మంచి సంభాషణ, లేఖన నైపుణ్యాలు ఉన్న న్యాయవాదులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయస్థాన అధికారిక వెబ్‌సైట్ డిస్ట్రిక్స్‌ఈకోర్ట్.గవ్.ఇన్/డీఎల్ఎస్ఏ-61ను సందర్శించాలన్నారు.

గంజాయి తరలిస్తున్న ఏడుగురు అరెస్టు



గోకవరం: గోకవరం మండలం రామన్నపాలెం వద్ద గంజాయి తరలిస్తున్న ఏడుగురిని గోకవరం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్సై శివ నాగబాబు, ఇతర సిబ్బంది గ్రామ శివారున బైక్‌లను తనిఖీ చేశారు. మూడు సంచుల్లో గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించారు. కశింకోట అనిల్ (మారేడుమిల్లి మండలం వేటుకూరు), కాకూరి చిన్నారెడ్డి(వై.రామవరం మండలం బచ్చులూరు), కమ్మకట్ల అశోక్‌కుమార్ (రాజమహేంద్రవరం), అన్నందేవర మోహన్‌శివశంకర్ (కడియం మండలం బుర్రిలంక), తుపాటి సాయిరామ్, మన్నే రామకృష్ణతో పాటు ఒక మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో వారి నుంచి రూ.1.62 లక్షలు విలువ చేసే 54 కేజీల గంజాయి, మూడు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్‌లు, రూ.2,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేయాల్సి ఉంది. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం తరలించామని ఎస్సై తెలిపారు.

మెట్ట రైతులకు ఊరట

- తాజా వానలతో జోరందుకున్న నారుపనులు
- వెదజల్లు కింద చేపట్టాలని అధికారులు సూచన
- రెండురోజులుగా మోస్తరు వర్షం

కొవ్వూరు: జిల్లాలో మెట్ట ప్రాంతంలో వర్షాధారంపై ఆధారపడి, చెరువుల కింద సాగు చేసే రైతులు తాజాగా వ్యవసాయ పనులకు ఉపక్రమించారు. వర్షాధారంపై ఆధారపడే రైతులు గతనెలలో ఖరీఫ్ పనులు ప్రారంభించలేదు. గడిచిన నాలుగు రోజుల నుంచి వాతావరణం కొంత అనుకూలిస్తుండటంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. 12,300 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. కొవ్వూరు నిడదవోలు మండలంలో గరిష్టంగా 14 శాతం దేవరపల్లి పెరవలి మండలంలో 11 శాతం చొప్పున నాట్లు వేశారు. జిల్లాలో మెట్ట ప్రాంతమైన గోకవరంలో కనిష్టంగా నారు పోశారు. మిగిలిన మండలంలో దాదాపు పూర్తి కావచ్చాయి. కోరుకొండ, గోపాలపురం, రాజానగరం, నల్లజర్ల గోకవరం మెట్ట మండలాలతో పాటు ఉండ్రాజవరం, కడియం మండలంలో నాట్లు పడలేదు, ఈ నెల ఆరంభంలో ఎండలు దంచి కొట్టాయి. మళ్లీ మూడు రోజుల నుంచి వరుణుడు కరుణించాడు.

వెదజల్లుకు ప్రోత్సాహం

జిల్లాలో కొంతమేర వరినాట్లు ఆలస్యం కావడంతో 10 నుంచి 15 శాతం ఆయకట్టులో వెదజల్లు విధానాన్ని అనుసరించేలా అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 1546 ఎకరాల్లో వెదజలు కింద నాట్లు వేశారు. దీని ద్వారా 20 రోజులు పంటకాల పరిమితి కలిసి వస్తుందని అధికారులు సూచిస్తున్నారు. మెట్ట ప్రాంత మండలాలైన గోకవరంలో 470, రంగంపేటలో 222, సీతానగరంలో 546, అనపర్తిలో 100, తాళ్ళపూడి కడియంలో 75 ఎకరాలు చొప్పున, గోపాలపురంలో 50 ఎకరాలు చొప్పున ఈ విధానంలో నాట్లు వేశారు. జూన్‌లో వర్షాలు ముఖం చాటేయడం, రుతుపవనాలు ఆలస్యంతో అధికారులు వెదజలు విధానంపై రైతుల్లో అవగాహన పెంచుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. గురువారం ఉదయం ఎనిమిది గంటలకు గడిచిన ఇరవై నాలుగు గంటల వ్యవధిలో సరాసరి 32.0 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే గరిష్ఠ వర్షపాతం.



కొవ్వూరు బస్టాండ్ సెంటర్ వర్షం కురుస్తున్న దృశ్యం

జిల్లాలో నమోదైన సగటు వర్షపాతం (మి.మీటర్లలో)

తేదీ	వర్షపాతం
4న	12.3
5న	19.9
6న	33.0

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోను వర్షం ప్రభావం చూపించింది. రాజానగరంలో గరిష్టంగా 54.6 మి.మీటర్లు కురవగా రాజమహేంద్రవరం అర్బన్‌లో 43.4, రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 48.4 మి.మీటర్లు, అనపర్తిలో 37.6,కడియంలో 34.8,సీతానగరంలో 48.2, గోక వరంలో 12.8,కోరుకొండలో 26.4,రంగంపేటలో 10.4,బిక్కవోలులో 16.8, తాళ్లపూడిలో 27.2, గోపాలపురంలో 24.2, నల్లజర్లలో 10.2, దేవరపల్లిలో 51.6, కొవ్వూరులో 52.4,చాగల్లులో 33.2,నిడదవోలులో 18.6, ఉండ్రాజవరంలో 34.2, పెరవలి మండలంలో 21.4 మి.మీటర్లు చొప్పున వర్షపాతం నమోదైంది. రానున్న మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచిస్తుంది.

పెంపుడు జంతువులకు రేబిస్ నివారణ టీకాలు



రేబిస్ టీకాలు వేస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సత్యగోవింద్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పెంపుడు జంతువులకు వ్యాధులు రాకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎస్‌జీటీ సత్యగోవింద్ అన్నారు. జూనోసిస్‌డేను పురస్కరించుకుని గురువారం స్థానిక దేవీచౌక్ సమీపంలోని జిల్లా పశువైద్యశాలలో జంతువులకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. డాక్టర్ సత్యగోవింద్ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 440 పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేశామన్నారు. నట్టలు, బాహ్య పరాన్న జీవులకు నివారణ మందులు పంపిణీ చేశామన్నారు. రాజమహేంద్రవరం ఉపసంచాలకులు డాక్టర్ మక్కిన వెంకటేశ్వర్లు, పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కల్లూరి సత్యనారాయణ, పశువైద్యులు బి.యోగానంద్, జి.లోకేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ అదుపు తప్పి పంట బోదెలోకి బోల్తా
డ్రైవర్‌ని కాపాడిన స్థానికులు



ట్రాక్టర్ కింద ఉన్న డ్రైవర్‌ని కాపాడేందుకు తాళ్లు కట్టి లాగుతున్న స్థానికులు

అల్లవరం: గోడితిప్ప సెంటర్ నుంచి అల్లవరం పొలంలో నిర్మాణంలో ఉన్న ఇంటికి సిమెంట్ లోడుతో వెళ్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి పంట బోదెలోకి బోల్తా పడింది. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ సత్తిబాబు పంటబోదెలోని ఊబిలోకి కూరుకుపోయాడు. ఆపై ట్రాక్టర్ పడిపోయింది. స్థానికులు హుటాహుటిన స్పందించి ట్రాక్టర్ కింద ఉన్న డ్రైవర్‌ని కాపాడేందుకు ట్రాక్టర్‌కి తాళ్లు కట్టి పైకి లేపడంతో ఊబిలోకి కూరుకుపోయిన డ్రైవర్‌ను కాపాడారు. డ్రైవర్ సురక్షితంగా ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో సుమారు 100 బస్తాలకు పైగా సిమెంట్ నీరు పాలైయ్యింది.

నేటి నుంచి టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రకాశం నగర్ : తూర్పుగోదావరి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7,8,9 తేదీల్లో మూడురోజుల పాటు రాజమహేంద్రవరంలోని శ్రీ త్యాగరాజ నారాయణ దాసు సేవ సమితి ఆడిటోరియంలో ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జేవీవీ అప్పారెడ్డి, వీటీవీ సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందినవారు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు.

గుర్తింపు ఉన్న పాఠశాలల్లోనే చదివించండి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ బోధించేందుకు అనుమతి లేకపోయినా విద్యార్థులను నమ్మించి స్కూళ్లలో చేర్చుకుంటున్నారని, దీనిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ ఉన్న పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని ఆయన సూచించారు. 2023-2024 విద్యాసంవత్సరంలో జిల్లాలో 18 పాఠశాలలు మాత్రమే సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ అందిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దీనిపై వివరాలకు డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రైవేట్ స్కూళ్లలో సొంత పాఠాలు

- పాఠ్య పుస్తకాలు ప్రభుత్వం నుంచి కొనుగోలు చేయాలని ఆదేశం
- ఆసక్తి చూపించని ప్రైవేట్ యాజమాన్యాలు
- అదనపు ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై భారం



రాయవరం: విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగానే ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను సిద్ధం చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం రోజునే అందించారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను సిద్ధం చేసింది. అయితే జిల్లాలోని పలు ప్రైవేట్/కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పబ్లిషర్లు ముద్రించిన పాఠ్య పుస్తకాలను విక్రయిస్తున్నాయి. ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన పాఠ్యాంశాల బోధనకు బదులుగా అనధికార పాఠ్య పుస్తకాలతో తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వం రూపొందించిన సిలబస్, పాఠ్య పుస్తకాలను ప్రైవేట్ పాఠశాలలు అమలు చేయాలి. అయితే ప్రైవేట్ పాఠశాలలు సొంత పాఠాలను బోధిస్తూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి.

ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో..

ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్యార్థులకు ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా రూపొందించి, ముద్రించిన పాఠ్య పుస్తకాలనే బోధించాలని 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగానే జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు అవసరమైన పాఠ్య పుస్తకాలనూ ప్రభుత్వం సకాలంలో సిద్ధం చేసింది. అయితే ప్రైవేట్/కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు వాటిని కొనుగోలు చేయకుండా, ప్రైవేట్ పబ్లిషర్ల నుంచి అధిక ధరలకు పుస్తకాలను కొనుగోలు చేస్తూ తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాయనే విమర్శలున్నాయి.

ఐదు శాతం చెల్లిస్తే చాలు

ప్రైవేట్/కార్పొరేట్ యాజమాన్యాలు పాఠశాలల్లోని విద్యార్థులకు కావాల్సిన పాఠ్య పుస్తకాల వివరాలను అందించి, విద్యాశాఖకు ఐదు శాతం మొత్తాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. దానిపై సమీపంలోని పుస్తక దుకాణంలో విద్యాశాఖ అధికారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పుస్తకాలను అందిస్తారు. విద్యార్థులు లేదా యాజమాన్యం మిగిలిన 95 శాతాన్ని చెల్లించి పుస్తకాలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ విధంగా ఎవరికీ భారం కాకుండా పుస్తకాలను ప్రభుత్వం ప్రైవేట్ విద్యా సంస్థలకు అందించేందుకు ఏర్పాట్లు చేసింది.

సొంత సిలబస్‌కు అవకాశం లేదు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్/కార్పొరేట్ పాఠశాలల్లో తప్పనిసరిగా ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన పాఠ్య పుస్తకాలతోనే బోధన సాగాలి. కాని ప్రైవేట్/కార్పొరేట్ పాఠశాలలు ఎస్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను కాకుండా తమ సొంత సిలబస్‌తో పుస్తకాలను ముద్రించి, వాటిని విద్యార్థులతో కొనుగోలు చేయిస్తున్నారు. దీని వల్ల విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థికంగా భారం పడుతోంది. తరగతిని బట్టి, పాఠశాల స్థాయిని బట్టి పాఠ్య పుస్తకాలకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి.

నిర్ణీత ధరలకే అమ్మకాలు చేపట్టాలి

పాఠ్య పుస్తకాలను నిర్ణీత ధరలకే విక్రయించేలా ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. 1వ తరగతి రూ.399, రెండో తరగతి రూ.425, 3వ తరగతి రూ.675, 4వ తరగతి రూ.702, 5వ తరగతి రూ.727, 6వ తరగతికి రూ.747, 7వ తరగతి రూ.871, 8వ తరగతికి రూ.1,181, 9వ తరగతికి రూ.1,167, 10వ తరగతికి రూ.859గా పాఠ్య పుస్తకాల ధరలను ప్రభుత్వం నిర్ణయించింది. ప్రైవేట్ దుకాణాల్లో కూడా ఎంఆర్‌పీకి మాత్రమే పాఠ్య పుస్తకాలను విక్రయించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

పుస్తకాలను కచ్చితంగా తీసుకోవాలి



ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్య పుస్తకాలను కచ్చితంగా కొనుగోలు చేయాలి. ప్రభుత్వం నిర్ణయించిన ధరలో ఐదు శాతాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాఠ్య పుస్తకాలను ఆర్డర్ పెట్టకుండా నిర్లక్ష్యంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

జిల్లాలో పరిస్థితి ఇదీ

ప్రైవేట్/కార్పొరేట్ పాఠశాలలకు అవసరమైన పాఠ్య పుస్తకాలను హెచ్‌ఎం లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి, కొనేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మండల విద్యాశాఖాధికారుల ద్వారా పాఠశాల యాజమాన్యాలకు సమాచారాన్ని చేరవేశారు. అయినా ప్రైవేట్/కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాల నుంచి ఆశించినంతగా స్పందన లేదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 511 ప్రైవేట్/కార్పొరేట్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 55 పాఠశాలలు మూతపడగా, ఒక పాఠశాల సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తోంది. మిగిలిన 455 పాఠశాలల్లో ఈ నెల ఒకటో తేదీ నాటికి 386 పాఠశాలలు పుస్తకాల కోసం ఇండెంట్ పెట్టాయి. ఇంకా 69 పాఠశాలలు నేటికీ ఇండెంట్ పెట్టలేదు. పాఠశాలలు ఇప్పటి వరకు 2,56,474 పుస్తకాలకు ఇండెంట్ పెట్టాయి. నూరు శాతం పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది.

తీయని పొత్తులు గుత్తులు.. గుత్తులు!



కొమరాడలో విచ్చుకున్న స్వీట్ కార్న్

మామిడికుదురు: కొమరాడ గ్రామంలో ఇంజినీరింగ్ విద్యార్థిని పోసంశెట్టి లక్ష్మీఅంజన సాయిరిశిత ఇంటి పెరట్లో వేసిన స్వీట్‌కార్న్ మొక్క ఒకే రెమ్మకు 13 పొత్తులతో అబ్బుర పరుస్తోంది. సాధారణంగా ఒకే రెమ్మ నుంచి రెండు లేదా మూడు పొత్తుల రావడం సహజం. దానికి భిన్నంగా 13 పొత్తులు విచ్చుకున్నాయి. మూడు నెలల క్రితం మొక్కజొన్న గింజ నాటానని అది మొలక వచ్చి కాపు కాసిందని రిశిత పేర్కొంది. ఎటువంటి రసాయనిక ఎరువులు వాడకుండా కేవలం ఇంట్లోని సేంద్రియ ఎరువులను మాత్రమే వేశామని చెప్పింది. సరదాగా నాటిన మొక్కజొన్న గింజ మొక్కగా పెరిగి కాపుకు రావడం, అబ్బుర పర్చే విధంగా గుత్తులు గుత్తులుగా పొత్తులు రావడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ పొత్తులను స్థానికులు వింతగా చూస్తున్నారు.

జేఎన్‌టీయూకే అభివృద్ధిపై గవర్నర్‌కు ప్రజెంటేషన్



జేఎన్‌టీయూకే ప్రగతిని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వివరిస్తున్న వీసీ ప్రసాదరాజు

న్యాక్ ఏ ప్లస్ రావడంపై గవర్నర్ ప్రశంస

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకేలో చేపడుతున్న అభివృద్ధిపై వర్సిటీ కులపతి, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విజయవాడ రాజ్‌భవన్‌లో వీసీ ప్రసాదరాజు గురువారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వర్సిటీకి న్యాక్ ఏప్లస్ హోదా రావడంపై గవర్నర్ హర్షం వ్యక్తం చేస్తూ వర్సిటీలో చేపడుతున్న మౌలిక వసతులు, భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. జేఎన్‌టీయూకేకు అనుబంధంగా ఉన్న తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్‌టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉన్న అనుబంధ కళాశాల విద్యావిధానంపై వివరించారు. ఈ నెల 1,2 తేదీల్లో వర్సిటీలో రాష్ట్ర వీసీలతో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు ఐదవ సమావేశం విజయవంతం అయిందని గవర్నర్‌కు తెలిపి విదేశీ వర్సిటీలతో చేసుకున్న గ్లోబల్ ఒప్పందాలు, మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్ రీసెర్చ్‌లో భాగంగా ఎంఎస్సీ డేటా సైన్స్ కోర్సు ప్రారంభిస్తున్నామని వీసీ ప్రసాదరాజు గవర్నర్‌కు తెలిపారు. రీసెర్చ్ స్కాలర్స్‌ను ప్రోత్సహించాలని, ఇంక్యుబేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి స్టార్టప్‌లు చేపట్టాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ వీసీ ప్రసాదరాజుకు సూచించారు. వీసీతో పాటు ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి శ్యామలరావు, ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, రిజిస్ట్రార్ సుమలత పాల్గొన్నారు.

‘బాబు’ మెప్పుకోసమే తప్పుడు కథనాలు

రామోజీ తీరుపై ద్వారంపూడి మండిపాటు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి



ఈనాడు ప్రతులను చెత్తకుప్పలో వేస్తున్న కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు శివప్రసన్న, నాయకులు, కార్యకర్తలు

కాకినాడ: కులగజ్జితో చంద్రబాబుకు రాజకీయ లబ్ధి కలిగించేందుకు ఈనాడు అధినేత రామోజీ రావు తనపై అవాస్తవాలతో కూడిన తప్పుడు కథనాలను ప్రచురిస్తున్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మండిపడ్డారు. ‘అతడొక అరాచకం ’ శీర్షికన గురువారం ఈనాడులో వచ్చిన కథనంపై గురువారం తన కార్యాలయంలో ద్వారంపూడి విలేకర్లతో మాట్లాడారు. వాస్తవాలను ఏ మాత్రం నిర్ధారించుకోకుండా తప్పుడు వార్త రాసారంటూ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలో గంజాయి వంటి మత్తు పదార్థాలను నియంత్రించేందుకు గడచిన నాలుగేళ్లుగా ఎన్నో చర్యలు తీసుకున్నామన్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే తన హయాంలో వీటిని పెంచి పోషించారని, అప్పట్లో సీఐలకు పోస్టింగ్‌లు ఇవ్వాలంటే రూ.లక్షల్లో ముడుపులు తీసుకోవడం వల్ల సదరు అధికారులు నిస్సహాయతతో వ్యవహరించడం వల్లే ఇక్కడ యువత గంజాయికి బానిసలయ్యారన్నారు. కాకినాడలోని ప్రతీ పోలీస్‌స్టేషన్‌లోను లంచాలకు తావులేకుండా ప్రజలకు పారదర్శకమైన పాలన అందించేలా చర్యలు తీసుకుంటున్నానని, ఆరోపణలు వస్తే ఇటీవల ఓ అధికారిని బదిలీ కూడా చేయించానన్నారు. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చి తనపై గంజాయి ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. 35 ఏళ్లనాటి అరట్లకట్ట వేసవి జలాశయంలోని పూడికను తొలగించడం ద్వారా నీటి నిల్వలు పెంచేందుకు చర్యలు తీసుకుంటే... దానికి కూడా పెడార్థాలు తీసి మట్టి అమ్ముకుంటున్నామంటూ వాస్తవదూరమైన నిందలు వేశారంటూ ధ్వజమెత్తారు. పేదల స్థలాల కోసం దుమ్ములపేట, పర్లోపేటలలో ఇళ్ల స్థలాలను సొంత ఖర్చులతో చదును చేయిస్తుంటే కబ్జా ముద్ర వేస్తున్నారని మండిపడ్డారు. కాకినాడ ప్రజలకు తానేంటో తెలుసునని ద్వారంపూడి పేర్కొన్నారు. ఈనాడు, ఆ పత్రికకు అనుబంధంగా ఉన్న పార్టీలు ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరనే విషయాన్ని గుర్తించాలన్నారు.

కోవిడ్‌పైనా రాజకీయం

కోవిడ్ సమయంలో ఎక్కడాలేని విధంగా కాకినాడలో పేద ప్రజలకు సేవలు అందించానన్నారు. ప్రత్యేకంగా కాల్‌సెంటర్ ఏర్పాటు చేసి ప్రతీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ అమలు జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ చేశానన్నారు. కొన్ని ఆస్పత్రులు అధికంగా సొమ్ము వసూలు చేస్తున్న అంశాన్ని సీఎం దృష్టికి కూడా తీసుకువెళ్లి ఆయా హాస్పిటల్స్ నుంచి రాష్ట్రంలోనే అత్యధికంగా పెనాల్టీలు వసూలు చేస్తే... ఆస్పత్రుల నుంచి లంచాలు తీసుకున్నామంటూ ఆరోపణలు చేయడం ఈనాడు గలీజు రాతలకు నిదర్శనంగా నిలిచిందని పేర్కొన్నారు. రెడ్డి సామాజిక వర్గానికి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరితో ఐక్యతతో మెలగడమే కాకుండా సేవ చేసే గుణం ఉందని, అందువల్లే ఇక్కడ తనలాంటి రెడ్డి సామాజిక వర్గ నేతలను ప్రజలు ఆదరిస్తున్నారని ద్వారంపూడి స్పష్టం చేశారు. వైఎస్సార్ శిష్యులుగా, జగన్‌ను అనుసరించే నాయకులుగా అవినీతికి పాల్పడడం, అబద్దాలు చెప్పడం, అక్రమాలు చేయడం తమకు అలవాటు లేదని స్పష్టం చేశారు. ఈనాడులో రాసిన విధంగా తాను అవినీతికి పాల్పడినట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచి వైదొలిగేందుకు సైతం సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ఇక ఈ దుర్వాసన (ఈనాడు) భరించలేం

ఇక ఈ దుర్వాసన (ఈనాడు) భరించలేకున్నాం... తప్పుడు రాతలను చదవలేకపోతున్నాం... ఇలాంటి పత్రిక మాకొద్దు బాబోయ్... అంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు ఈనాడు దినపత్రిక తీరుపై భగ్గుమన్నాయి. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని ఉద్దేశించి ‘అతనో అరాచకం’ శీర్షికన గురువారం ఈనాడులో వచ్చిన కథనంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. కాకినాడ రెవెన్యూకాలనీలోని డంపింగ్‌యార్డు వద్దకు ర్యాలీగా వెళ్లి అక్కడ ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేశారు. ఆ పత్రిక అధిపతి రామోజీరావు దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి దహనం చేశారు. ముఖ్యంగా అక్కడకు వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇక ఈ దుర్వాసన (ఈనాడు) భరించలేకపోతున్నామంటూ ఆ పత్రికలను చించివేసి డంపింగ్‌యార్డులోని చెత్తకుప్పల్లో పడేశారు. రామోజీ డౌన్... డౌన్... అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారంపూడికి ఉన్న ప్రజాదరణ చూసి ఓర్వలేక నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, పత్రికా స్వేచ్ఛ ముసుగులో ఇటువంటి వైఖరి మంచిదికాదని హితవు పలికారు. ఎమ్మెల్సీగా ఎంపికైన కర్రి పద్మశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, స్మార్ట్‌సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సముద్రంలో మునిగి విద్యార్థి మృతి

మరొకరి గల్లంతు



మృతిచెందిన గొల్లమండల పవన్‌కుమార్ (ఫైల్)



గల్లంతయిన తమ్మిశెట్టి నవీన్ కృష్ణ

మలికిపురం: డిగ్రీ రిజల్ట్ వచ్చిన ఆనందం అంతలోనే ఆవిరి అయింది. ఆ విద్యార్థుల కుటుంబాలలో తీవ్ర విషాదం మిగిల్చింది. పాస్ అయ్యామన్న ఆనందంలో సముద్ర స్నానానికి వెళ్లిన విద్యార్థులలో ఒకరి మృతిచెందగా, మరొకరు గల్లంతయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మలికిపురం ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీ ఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు నలుగురు గురువారం మలికిపురం మండలం చింతలమోరి బీచ్‌కు విహార యాత్రకు వెళ్లారు. డిగ్రీ మొదటి సంవత్సరం ఫలితాలు బుధవారం రాగా వీరు మంచిమార్కులతో పాస్ అయ్యారు. దీంతో వీరందరూ కలిసి చింతలమోరి బీచ్‌కు వెళ్లారు. కలిసి ఆనందంగా గడిపి సముద్రంలో స్నానానికి దిగారు. మలికిపురం మండలం పడమటిపాలెం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి నవీన్ కృష్ణ సముద్రంలో కొట్టుకు పోతుండగా సఖినేటిపల్లి మండలం ఉయ్యూరి వారి మెరక గ్రామానికి చెందిన గొల్ల మండల పవన్ కుమార్(19) కాపాడే ప్రయత్నంలో అతనితోపాటు కొట్టుకు పోయాడు. వీరిలో గొల్ల మండల పవన్‌కుమార్ మృతదేహం తీరానికి కొట్టుకు వచ్చింది. సమాచారం అందుకున్న మలికిపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఘటనా స్థలానికి చేరుకుని, బాధిత కుటుంబాలను ఓదార్చారు.

డిగ్రీ ఫిజిక్స్ పాఠ్య పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ



ఫిజిక్స్ పాఠ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: బీఎస్సీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా రూపొందించిన ‘వేవ్ ఆప్టిక్స్’ ఫిజిక్స్ పేపర్ 2 పాఠ్య పుస్తకాన్ని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. సీబీసీఎస్ నిబంధనలను అనుసరించి ఏపీలోని అన్ని యూనివర్సిటీలకు ఉపయోగపడే విధంగా కామన్ సిలబస్‌తో ఈ పుస్తకాన్ని తయారు చేశారన్నారు. యూనివర్సిటీ ఫిజిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి, దీప్తి డిగ్రీ కాలేజీ (మామిడికుదురు) ఫిజిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ వీఎస్‌పీ యర్రంశెట్టి సంయుక్తంగా ఈ పుస్తకాన్ని రూపొందించారంటూ రచయితలను అభినందించారు. నూతన అంశాలను విద్యార్థులకు అందించడంలో అధ్యాపకులంతా కృషి చేయాలని వీసీ సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి జయనిర్మల, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డీన్ ఆచార్య కె.రమణేశ్వరి, హిమాలయ పబ్లిషర్ ఆర్‌ఎం విజయపాండే పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాల అవకతవకలపై విచారణ

- స్వాహా చేసిన రూ.16 లక్షలు చెల్లించేందుకు వీఓఏ అంగీకారం
- ఆడిట్ నిర్వహించాలని అధికారుల నిర్ణయం



సింగవరంలో డ్వాక్రా మహిళలను విచారిస్తున్న అధికారులు

నిడదవోలు రూరల్: మండలంలోని సింగవరం గ్రామంలో డ్వాక్రా సంఘాల సభ్యులు తీసుకున్న బ్యాంక్ లింకేజీ రుణాలు తిరిగి బ్యాంక్‌కు చెల్లించకుండా ఆ సొమ్మును విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీఓఏ) చాలనాటి లలిత దుర్వినియోగం చేసిన ఘటనపై అధికారులు గురువారం విచారణ చేపట్టారు. సింగవరం గ్రామసంఘం పరిధిలో 45 గ్రూపులుండగా 446 మంది సభ్యులున్నారు. వీరంతా నిడదవోలు ఇండియన్ బ్యాంక్ నుంచి బ్యాంక్ లింకేజీ రుణాలు తీసుకున్నారు. ప్రతినెలా సభ్యులంతా తాము తీసుకున్న రుణాలకు సంబంధించిన డబ్బు తిరిగి బ్యాంక్‌కు కట్టాలని లలితకు చెల్లించేవారు. కానీ వీఓఏ లలిత ఆ డబ్బులు బ్యాంకుకు కట్టకుండా స్వాహా చేసింది. దీంతో సభ్యులు డ్వాక్రా అధికారులకు ఫిర్యాదు చేయడంతో సింగవరంలో విచారణ చేపట్టారు. వీఓఏ లలిత సుమారు రూ.16 లక్షలు దుర్వినియోగం చేసినట్లు విచారణలో స్త్రీ నిధి జిల్లా మేనేజర్ రత్నకుమారితో పాటు మరో ఐదుగురు డీఆర్‌డీఏ అధికారుల బృందం గుర్తించినట్లు ఏపీఎం ఈ.శ్యామ్‌సుందర్ తెలిపారు. స్వాహా చేసిన సొమ్ము తిరిగి చెల్లించేందుకు డ్వాక్రా అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో వీఓఏ లలిత అంగీకరించిందన్నారు. గత నెలలో పెరవలి మండలం ఖండవల్లి గ్రామంలో కూడా స్త్రీ నిధులు దుర్వినియోగం కావడంతో పాటు సింగవరంలో బ్యాంక్ లింకేజీ రుణాల్లో అవకతవకలు జరగడంతో నియోజకవర్గంలో ఉన్న డ్వాక్రా గ్రూపులు తీసుకున్న రుణాలకు సంబంధించి త్వరలోనే పూర్తి స్థాయి ఆడిట్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.

శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం
అయినవిల్లి గ్రామం & మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
ఇ-టెండరు/సీల్డ్ టెండరు/బహిరంగ వేలం ప్రకటన

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం & గ్రామం, శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం నకు భక్తులు సమర్పించిన కొబ్బరి చెక్కలు ప్రోగుచేసుకొని తీసుకొని వెళ్ళు లైసెన్సు హక్కు నకు ది.16.11.2023 నుండి ది.15.11.2024 వరకు 1 సంవత్సరము కాలపరిమితికి ది.21/07/2023 శుక్రవారం ఉ.గం.10.00లకు దేవస్థానం కార్యాలయం, అయినవిల్లి వద్ద దేవదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించుటకు ఇ-టెండర్/సీల్డ్ టెండర్/బహిరంగ వేలంపాట కోరడమైనది. ఇ-టెండర్ దాఖలు చేసుకొనుటకు http://tender.apeprocurement.gov.in లాగిన్ అయి A.P.Endowments Department నందు Circle : Sri Vighneswara Swamy Temple, Inavilli నుండి టెండర్ షెడ్యూల్స్ పొందవచ్చును.

టెండర్ వివరములు	ధరావత్తు	పాట వివరములు
శ్రీ స్వామి వారి భక్తులు సమర్పించిన కొబ్బరి చెక్కలు ప్రోగుచేసుకొని తీసుకొని వెళ్ళు లైసెన్సు హక్కు నకు ది.16.11.2023 నుండి ది.15.11.2024 వరకు (1 సంవత్సరము)	2,00,000/-	బహిరంగ వేలం : ది. 21/07/2023 ఉదయం గం.11.15 లకు బాక్స్ టెండర్ దాఖలు : ది.21/07/2023 ఉదయం గం.10.45 లకు బాక్స్ టెండర్ తెరచు సమయం : ది.21/07/2023 ఉదయం గం.11.30 లకు ఇ-టెండర్ : ది.08.07.2023 నుండి ప్రారంభం ఇ-టెండర్ ఆఖరు తేది : ది.21.07.2023 ఉదయం 10.30 ల వరకు ఇ-టెండర్ తెరచు సమయం: ది.21.07.2023 మధ్యాహ్నం 12.00లకు

ముఖ్యషరతులు: 1) ధరావత్తు (Tender Deposit) The Executive officer, Sri Vighneswara Swamy Temple, Ainavilli పేరున ఏదైనా జాతీయ బ్యాంక్ నుండి D.D. తీసి జతపర్చవలెను. 2) టెండర్ షెడ్యూల్ ది.08.07.2023 నుండి ది.21.07.2023 వరకు దేవస్థాన కార్యాలయం పనిచేయువేళలో రూ.500/-లు చెల్లించి పొందగలరు. 3) పూర్తి షరతులు కార్యాలయం నందు పొందవలెను. వివరములకు: 9490225812/9491007474 4) ఇ-టెండర్ నందు పాల్గొనే టెండరుదారులు దరఖాస్తు ధర రూ.500/- మరియు ధరావత్తు Online ద్వారా చెల్లించవచ్చును. ఇట్టి టెండరుదారుడు సదరు రోజుతో బహిరంగ వేలం నందు పాల్గొనవచ్చును.

తేది: 06.07.2023 స్థలం: అయినవిల్లి — నంబూరి వెంకటరమణరాజు, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి — శ్రీ ముదునూరి సత్యనారాయణరాజు, కార్యనిర్వహణాధికారి